# దేవుని రాజ్యము

## The Kingdom of God

యేసు – నేనితర పట్టణములలోను దేవుని రాజ్యసువార్తను ప్రకటింపవలెను. ఇందు నిమిత్తమే నేను పంపబడితినని వారితో చెప్పెను.

లూకా 4:43.

# దేవుని రాజ్యము
## The Kingdom of God
మానవ రాజకీయాలలో దైవిక ఉద్దేశ్యము

దేవుని రాజ్యమును గూర్చిన అంశము ప్రాముఖ్యమైన అంశములలో మొదటిది. కొందరైతే ఇది ఊహాజనిత విషయమని భావిస్తారు. ఇది తెలిసికొనుటకు ఆసక్తికరముగాయుండి, యోచించుటకు కూడా బాగుగనే యుండును గాని, ఇది అంత ప్రాముఖ్యమైనదికాదని కొందరి భావన. ఈ విషయములో లేఖనములను బట్టి పరిశీలించినట్లయిన ఇందుకు విరుద్ధముగా కనుపిస్తుంది. అనగా మనము ప్రప్రథమముగా నేర్చుకొనవలసిన విషయముగా, క్రొత్త నిబంధన సంగతులన్నిటిలో యిది మొట్టమొదటిది. దీనిని అర్థము చేసికొనకుండా, విశ్వసించకుండా క్రొత్త నిబంధన విధానములో క్రైస్తవునిగా నుండుట అసాధ్యమని తెలియజేస్తుంది. క్రీస్తు తనకు తానుగా చెప్పినమాటలే యిందుకు సాక్ష్యము. "…. ఆయన రాజ్యమును, నీతిని మొదటి వెదకుడి" మత్తయి 6:33.

# దేవుని రాజ్యమును గూర్చి యేసు బోధించినాడు
## Jesus Preached the Kingdom of God

దేవుని రాజ్యమని అర్థము వచ్చు ప్రతి సందర్భములోను యేసు దేవుని రాజ్యమును వెదకుమని ప్రోత్సహించుచు, ఆయన రాజ్యముగూర్చి బోధించినాడు ఈ సాక్ష్యమును మనము లూకా 8వ అధ్యాయములో చూచెదము.

"వెంటనే ఆయన దేవుని రాజ్యసువార్తను తెలుపుచు, ప్రకటించుచు ప్రతిపట్టణములోను ప్రతి గ్రామములోను సంచారముచేయుచుండగా" లూకా 8:1.

యేసు తన కార్యములో సహకరించుటకు ఏర్పాటు చేసికొనిన తన శిష్యులను ఇదే విషయమునుగూర్చి బోధించునిమిత్తము పంపినట్టు తొమ్మిదవ అధ్యాయములో చూచెదము.

"….. దేవుని రాజ్యమును ప్రకటించుటకును రోగులను స్వస్థపరచుటకును వారిని పంపెను" లూకా 9:1,2.

ఒకానొక సందర్భములో యేసు జనసమూహమును విడచి, అరణ్యప్రాంతమునకు ఒంటరిగా వెళ్ళినాడు. ఇది తెలిసిన జనసమూహము ఆయనను చూడవెళ్ళినపుడు ఆయన వారిని చేర్చుకొని, దేవుని రాజ్యమునుగూర్చి వారితో మాట్లాడినాడు లూకా 9:11. ఇది ఆయనకు అలవాటు మాత్రమేగాక ఈ సందర్భములో తనను గూర్చికూడా చెప్పుకొనినాడు. "నేనితరపట్టణములలోను దేవుని రాజ్యసువార్తను ప్రకటింపవలెను; ఇందునిమిత్తమే నేను పంపబడితినని వారితో చెప్పెను" లూకా 4:43.

యేసు బోధించిన సువార్తలోని దేవుని రాజ్యము యొక్క ప్రాముఖ్యత క్రొత్త నిబంధనలోని యితర లేఖన భాగములలో కూడా తెలియుచున్నది.

## దేవుని రాజ్యమును గూర్చి శిష్యులు బోధించిరి

**The dísciples preached the Kingdom of God**

దేవుని రాజ్యమును గూర్చి శిష్యులు బోధించిరని గుర్తించవలసియున్నది. ఈ సంగతిని ముందుగా వారెరుగరుగాని యేసు మరణించిన తరువాత సంపూర్ణముగా వారు గుర్తించిరి. క్రొత్త నిబంధన సత్యములన్నిటిని యేసు మరణమును గూర్చి వివరించుచున్నవనుటకు సందేహము లేదు. మరియు యేసుచేతను, ఆయన శిష్యులచేతను ప్రకటింపబడిన ఆ సువార్తను మనము కలిగియుండాలి; మరియు యేసు చనిపోవనున్నాడని తెలియకమునుపే శిష్యులు సువార్తను ప్రకటించినారననుది యథార్థము. "వారు బయలుదేరి అంతటను సువార్తను ప్రకటించుచు రోగులను స్వస్థపరచుచు గ్రామములలో సంచారముచేసిరి" అని లూకా 9:6లో వ్రాయబడినది. మరియు "ఆయన తన పండ్రెండు మంది శిష్యులను పిలిచి - ఇదిగో యెరూషలేమునకు వెళుచున్నాము; మనుష్యకుమారుని గూర్చి ప్రవక్తలచేత వ్రాయబడిన మాటలన్నియు నెరవేర్చబడును; ఆయన అన్యజనుల కప్పగింపబడును; వారు ఆయనను అపహసించి అమమానపరచి ఆయన మీద ఉమ్మివేసి ఆయనను కొరడాలతో కొట్టి చంపుదురు. మూడవదినమున ఆయన మరల లేచునని చెప్పెను; వారు ఈ మాటలలో ఒకటైనను గ్రహింపలేదు.

ఈ సంగతి వారికి మరుగుచేయబడెను గనుక ఆయన చెప్పిన సంగతులు వారికి బోధపడలేదు" లూకా 18:31-34 అని చదివెదము.

క్రీస్తుమరణమును సమీపించుచున్నాడని వారెరుగకయే వారు సువార్తను ప్రకటించుచుండగా వారేమి ప్రకటించినారని ప్రశ్నించినపుడు "దేవునిరాజ్యము ప్రకటించుటకు వారిని పంపెను" అని లూకా 9:2లో ఉన్నలేఖనమే వారికి తగిన జవాబుగా ఉండును. శిష్యులకు అర్థముకాకపోయినను దేవుని రాజ్యమునుగూర్చి ప్రకటించుటకే వారు పంపబడిరి.

## క్రీస్తు మరణానంతరము అపొస్తలుల బోధ

**Apostolic Preaching after the death of Christ**

యేసు శరీరధారియై జీవించిన దినములవలే తనశిష్యులు కూడ అదే సబంధముకలిగి క్రీస్తు చనిపోయి, తిరిగి లేచి పరలోకమునకు ఆరోహణమైన పిదప అపొస్తలుల జీవితములకు సంబంధించి సువార్తను గూర్చిన బోధ ఆరోహణమునకు ముందు ఏ విధముగానున్నదో ఆరోహణము తరువాత కూడా అదే విధముగానున్నది. అయితే ఆరోహణము తరువాత బోధలో యేసు మరణపునరుత్థానములు జోడించబడినవి. అయితే యేసు సశరీరుడుగా ఈ లోకమున జీవించినపుడు దేవుని రాజ్యమునుగూర్చిన విషయములలో ఎట్టి మార్పుగాని, విస్మరించుటగాని, ఖండించుటగాని, జరుగలేదు, నిరంతరము ఒకే విధముగా ప్రకటించబడినది.

## అపొస్తలుల బోధకు దృష్టాంతము

**Illustration of Apostolic Preaching**

యితర సాక్ష్యాధారములతోపాటు అపొ.కా. 8వ అధ్యాయములో యిది ఋజువుపర్చబడినది. అయిదవ వచనములో యిలాగు వ్రాయబడినది. "అప్పుడు ఫిలిప్పు సమరయ పట్టణము వరకు వెళ్ళి క్రీస్తును వారికి ప్రకటించుచుండెను" అపొ.కా 8:5. అయితే క్రీస్తునుగూర్చి ఏమని ప్రకటించినాడని మనము ప్రశ్నిస్తే దానికి జవాబు పన్నెండవ అధ్యాయములో దొరుకుతుంది. "అయితే ఫిలిప్పు దేవుని

రాజ్యమునుగూర్చి యేసుక్రీస్తు నామమునుగూర్చియు సువార్త ప్రకటించుచుండగా వారతని నమ్మి పురుషులును, స్త్రీలును బాప్తీస్మము పొందిరి" అపొ.కా 8:12. ఈ వాక్యమునుబట్టి ఫిలిప్పు దేవునిరాజ్యమునుగూర్చి ప్రకటించినట్లు తెలుస్తుంది. ఫిలిప్పు వలెనే కడమ అపొస్తలులును ప్రకటించియుందురు. ఒక అపొస్తలుని బోధనుసరించియే మిగిలిన అపొస్తలుల బోధలువుండునని జ్ఞానవంతులందరూ ఎరిగినదే. ఇది ఫిలిప్పు ప్రత్యేకముగా, వ్యక్తిగతముగాచేసిన బోధయనుటకు ఆస్కారములేదు. ఇందుకు పౌలును కూడా ఉదాహరణముగాగైకొందుము. రోమా సామ్రాజ్యమందలి అన్ని దేశములకు వెళ్ళి సువార్త నందించుటకు పౌలు ప్రత్యేకముగా ఆజ్ఞాపించబడ్డాడు, మరియు మనము రక్షించబడాలంటే అన్యులైనను మనము ఆయన బోధను విశ్వసించాలి. పౌలు దేవుని రాజ్యమును గూర్చి ప్రసంగించిన దానికి తనకు తానుగా చెప్పిన ఋజువు ఇదిగో.....

"ఇదిగో దేవుని రాజ్యమునుగూర్చి ప్రకటించుచు నేను మీ మధ్యను సంచరించుచుంటిని - మీలో ఎవరును ఇకమీదట నా ముఖముచూడరని నాకిప్పుడు తెలియును" అపొ.కా 20:25.

ఈ ఋజువును అపొస్తలుల కార్యముల గ్రంథములో లూకా స్థిరపరచినాడు.

"తరువాత అతడు సమాజమందిరములోనికి వెళ్ళి ప్రసంగించుచు దేవుని రాజ్యమునుగూర్చి తర్కించుచు ఒప్పించుచు, ధైర్యముగా మాటలాడుచు మూడునెలలు గడిపెను" అపొ.కా 19:8.

మరియు యిదేవిషయము అపొస్తలుల కార్యముల గ్రంథము చివరి అధ్యాయములో ఋజువుపర్చబడినట్లు చూచెదము.

"ఉదయము నుండి సాయంకాలము వరకు అతడు దేవుని రాజ్యమునుగూర్చి పూర్తిగా సాక్ష్యమిచ్చుచు.... వారిని ఒప్పించుచుండెను" అపొ.కా 28:23.

"పౌలు రెండు సంవత్సరములు పూర్తిగా తన అద్దె యింటకాపురముండి తన యొద్దకు వచ్చువారినందరిని సన్మానించి, ఏ ఆటంకమును లేకపూర్ణధైర్యముతో దేవుని రాజ్యమునుగూర్చి ప్రకటించుచు ప్రభువైన యేసుక్రీస్తును గూర్చినసంగతులు బోధించుచుఉండెను" అపొ.కా 28:30,31 అని వ్రాయబడినది. గనుక మన

అనుదినజీవితములోను, సిద్ధాంతములందును మనము క్రొత్త నిబంధన గ్రంథమంతట పదేపదే చెప్పబడిన "దేవుని రాజ్యము" అను పదమునకు మనము తలలువంచి మన బోధలలో కూడా యిందుకు సమాంతరమగు పద్ధతినుపయోగించాలి.

## దేవుని రాజ్యమనగానేమి?

**What is the Kingdom of God?**

దేవుని రాజ్యమనగానేమి? అను ప్రశ్న యిపుడు ఉత్పన్నమయినది. ఇది మామూలు మాటల సముదాయముకాదు, అనంత విధానములో మనము బోధించు "సిద్ధాంతములందు ఉపయోగించు ద్వందార్థ సహితశృంగారపదజాలము కాదు" గనుక దేవుని రాజ్యమను ఈ మాట అతిప్రాముఖ్యమైన ప్రశ్న. ఈ మాట గ్రంథములో తరచుగా ప్రయోగించబడినది, నిర్దిష్టముగా ప్రయోగింపబడినది. దీనికి ఒక ప్రత్యేకమైన, ఒక నిర్దిష్టమైన క్రీస్తు మరణమునకు వేరుగానున్న అర్థము యిందు యిమిడియున్నది. గనుక ఇది ఒక ప్రత్యేకమైన పదసముదాయము. క్రీస్తు మరణమునుగూర్చి ఏమియు తెలియని కాలములో అపొస్తలుల చేత యిది బోధింపబడినది గనుకను, "దేవుని రాజ్యమునుగూర్చియు, యేసుక్రీస్తు నామమును గూర్చియు" అని వ్రాయబడినది గనుక యిది క్రీస్తు మరణముతో ముడిపడియున్నది గనుక ఈ మాట అనగా దేవుని రాజ్యమనునది చాలా ప్రముఖ్యమైన ప్రశ్న గనుక శిష్యుల యొక్కయు అపొస్తలుల యొక్కయు బోధలలో ఏమివున్నదో తెలిసికొనుట కూడా చాలా ముఖ్యము.

## రక్తమాంసములు దానిని స్వతంత్రించుకొనలేవు

**Flesh and blood cannot inherit it**

దీనినిగూర్చి పాత నిబంధనలో విపులముగా వ్రాయబడినప్పటికిని క్రొత్త నిబంధనలోనే కనుగొనెదము. ఇది జనుల జీవితానుభవములలోగాక సువార్తను విశ్వసించిన వారి జీవితములలో రాబోవు కాలమునకు (భవిష్యత్కాలమునకు)

సంబంధించినదిగా వివిధ వచనాలలో ఈ సత్యము మనకు కనబడుతుంది. 1కొరింథీ 15:50లో యిలాగు వ్రాయబడింది - "సహోదరులారా, నేను చెప్పునది ఏమనగా రక్తమాంసములు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొననేరవు. క్షయత అక్షయతను స్వతంత్రించుకొనదు" రక్తమాంసములు దీనిని స్వతంత్రించుకొనవని చెప్పబడినది గనుక దేవుని రాజ్యమనునది మర్త్యులగు ఈ మానవులు గతకాలములోగాని, ప్రస్తుత కాలమునగాని చూడని ఒక ప్రత్యేకమైనదై యుండాలి. రక్తమాంసములు కంటికి కనుపించునవని పౌలు అభిప్రాయపడినాడు. అయితే ఈ శరీరమునకు ఇది అతీతమైనట్టిదని అర్థము. యిది రక్తమాంసములకు సంబంధించిన, ఈ లోక సంబంధమైనదని కొందరనవచ్చును గాని ఈ లేఖనభావము అదికాదు. ఈ లోకసంబంధులు దేవుని రాజ్యములో ప్రవేశించలేరని స్పష్టముగా తెలియుచున్నది. పౌలు దేనినిగూర్చి మాట్లాడుచున్నాడు. అతడు మృతుల పునరుత్థానమునుగూర్చి మాట్లాడుచున్నాడు. శరీర సంబంధమైన రెండు గుణములనుగూర్చి అతడు చెప్పుచున్నాడు. రక్తమాంసములు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనలేవని 44-53 వచనములలో చెప్పబడినది. గనుక దేవుని రాజ్యములో మనము ప్రవేశించవలెనని మనలోని శరీర సంబంధమైన రక్తము, మాంసము అనునవి మార్పుచెందవలసియున్నవి.

## నీతి, జీవముల యొక్క భవిష్యత్ రాజ్యము

**A future dominion of righteousness and life**

ఏది ఏమైనప్పటికిని దేవుని రాజ్యమనునది ఊహాజనితమైనట్టిది కాదని గ్రంథమందంతట వ్రాయబడిన వాగ్దానములద్వారా మనకు తెలియుచున్నది. ఇది ఏక భావముతో కూడినదికాదని, యేసుక్రీస్తు రాకడ సమయములో తెలియపరచబడునని, మన ప్రస్తుత అనుభవముకాదని తెలియుచున్నది. 2తిమోతి 4:1లో చూచెదము. "దేవుని యెదుటను సజీవులకును మృతులకును తీర్పుతీర్చు క్రీస్తు యేసు యెదుటను, ఆయన ప్రత్యక్షతతోడు, ఆయన రాజ్యముతోడు నేను అనబెట్టి చెప్పునదేమనగా" ఇచట ఆయన ప్రత్యక్షత, ఆయన రాజ్యము, అను

రెండు విషయములను కలుపుచున్నాడు. ఇవి రెండు సమాంతరముగానుండునా? పేతురు చెప్పిన దానిని బట్టి యిది సాధ్యమే. అందువలన సహోదరులారా మీ పిలుపును, ఏర్పాటు నిశ్చయము చేసికొనుటకు మరిజాగ్రత్తపడుడి. మీరిట్టి క్రియలచేయువారైతే ఎప్పుడును తొట్రిల్లరు, ఆలాగున మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు యొక్క నిత్యరాజ్యములో ప్రవేశవుమీకు సమృద్ధిగా అనుగ్రహింపబడును 2పేతురు 1:10,11. ఇది ఎప్పుడు జరుగునని ప్రశ్నించినపుడు యేసుక్రీస్తు ప్రత్యక్షమయినపుడు అని పేతురు జవాబిస్తున్నాడు 1పేతురు 1:7 దీనినే అతడు యేసుక్రీస్తు ప్రత్యక్షమయినపుడు మీకు తేబడు కృప విషయమైన సంపూర్ణ నిరీక్షణ 1పేతురు 1:13 అని దేవుని రాజ్యమును వర్ణించినాడు.

## క్రీస్తు ప్రత్యక్ష సమయమునకైన ఏర్పాటు

**To be set up at the appearing of Christ**

దేవుని రాజ్యములో ప్రవేశించుటకు వేరొక సమయముగలదని, పేతురు వ్రాయుచున్న విశ్వాసులందరు పరీక్షాకాలములోవున్నారని ఈ వాక్యములద్వారా తెలియుచున్నది. ఈ క్రిందివచనములు చదివినపుడు ఈ విషయము మరింత విశదమగును.

"నశించిపోవు సువర్ణము అగ్నిపరీక్షవలన శుద్ధపరచబడుచున్నది గదా, దానికంటే అమూల్యమైన మీ విశ్వాసము ఈ శోధనలచేత పరీక్షకు నిలిచినదై యేసుక్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీకు మెప్పును, మహిమయు, ఘనతయు కలుగుటకు కారణమగును. మీరాయనను చూడకపోయినను ఆయనను ప్రేమించుచున్నారు. ఇప్పుడాయనను కన్నులార చూడకయే విశ్వసించుచు... చెప్పశక్యమును మహిమాయుక్తమునైన సంతోషముగలవారై ఆనందించుచున్నారు. కాబట్టి మీ మనస్సు అను నడుముకట్టుకొని నిబ్బరమైన బుద్ధిగలవారై యేసుక్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీకు తేబడు కృపవిషయమైన సంపూర్ణ నిరీక్షణ కలిగియుండుడి" 1పేతురు 1:7,8,13.

యేసుక్రీస్తు కనబడినపుడు మాత్రమే దేవుని రాజ్యము ప్రత్యక్షపరచబడును,

మరియు ఆయన శిష్యులైనవారు ఈ లోకానికి ఆహ్వానించబడెదరు. ఆ రాజ్యమును వీరే స్వతంత్రించుకొనెదరు. యాకోబు మాటలు దీనిని ధృవపరచుచున్నవి.

"నా ప్రియ సహోదరులారా, ఆలకించుడి, ఈ లోక విషయములో దరిద్రులైన వారిని విశ్వాసమందు భాగ్యవంతులుగాను, తన్ను ప్రేమించువారికి తాను వాగ్దానముచేసిన రాజ్యమునకు వారికి తాను వాగ్దానముచేసిన రాజ్యమునకు వారసులుగాను ఉండుటకు దేవుడేర్పరచుకొనలేదా?" యాకోబు 2:5.

రెండు విషయములు యిచట కనబడుచున్నవి. స్వతంత్రించుకొనుట అనునది ఒకటి. ఇది భావికాలములో పొందబోవునట్టిది. యిది ప్రస్తుతములేదుగాని యిది పొందుటకైన వాగ్దానము మనకనుగ్రహించబడినది. యిప్పుడున్న పరిస్థితిలో అనుగ్రహించబడునట్టిది కాదు. యాకోబునుబట్టి దేవుని రాజ్యము వాగ్దానముతో కూడినది గనుక యిది భవిష్యత్తుకు సంబంధించినది. అట్లయిన యిది ఏమైయున్నది?

## యెరూషలేము సంబంధమైన రాజ్యము

**The Kingdom in relation to Jerusalem**

లుకా 19:11 వచనమును అర్థముచేసికొని, దేవుని రాజ్యమునుగూర్చి అర్థము చేసికొనుటకు ప్రారంభించెదము.

"వారు ఈ మాటలు వినుచుండగా తాను యెరూషలేమునకు సమీపముగావున్నందునను, దేవుని రాజ్యము వెంటనే అగుపడునని వారు తలంచుట వలనను ఆయన మరియొక ఉపమానముచెప్పెను"

ఇందలి మాటలను గమనించుము. దేవుని రాజ్యము తక్షణమే కనుపించునని వారు తలంచారు. వారిలో విశ్వాసమున్నది గనుక వారు ఓపికగలిగి కనిపెట్టారు. వారి ఆలోచన తప్పుగానున్నది గనుక ఆయన వారికి మరియొక ఉపమానము చెప్పినాడు. "ఆయన యిట్లు మాట్లాడుటకు మరియొక కారణము కూడావున్నది. "ఆయన యెరూషలేమునకు సమీపముగానున్నందున" అని వ్రాయబడినది. ఏల? ఆ కాలమున యేసు యెరూషలేమునకు సమీపముగావుండి దేవుని రాజ్యమునుగూర్చి

కనిపెట్టియుండుటలో కూడా కొంత సహజత్వము కనిపిస్తుంది. "మందలగోపురమా, సీయోను కుమార్తె పర్వతమా, మునుపటిలాగున యెరూషలేము కుమార్తె మీద నీకు ప్రభుత్వము కలుగును" మీకా 4:8 అని మీకా ప్రవక్త వ్రాయుచున్నాడు.

## యెరూషలేమును గూర్చిన ప్రవచనములు

**Prophecies concerning Jerusalem**

అపొస్తలులు ప్రకటించిన దేవుని రాజ్యము యెరూషలేములో ప్రత్యక్షమగునని ప్రజలందరు వేచిచూస్తున్నారు. ఈ ప్రవచనము యెరూషలేమునుగూర్చియా అని యోచించవలసియున్నది. సంఘము బలముపొందుననునది కూడా ప్రవచనమా? అని యోచించవలసివచ్చినది. సీయోను కుమార్తె అని వ్రాయబడిన మాట యెరూషలేము కుమారైలారా! అని వ్రాయబడిన మాటను చదివినప్పుడు ప్రవచనమునుగూర్చిన సంశయముగలుగును.

"సీయోను నివాసులారా, బహుగా సంతోషించుడి, యెరూషలేము నివాసులారా ఉల్లాసముగా ఉండుడి. నీ రాజు నీతిపరుడును, రక్షణగలవాడును, దీనుడునై, గాడిదను, గాడిదపిల్లను ఎక్కి నీయొద్దకు వచ్చుచున్నాడు" జెకర్యా 9:9. ఈ ప్రవచనము నెరవేరినది మరియు దీని నెరవేర్పు క్రొత్త నిబంధనలో వ్రాయబడినది మత్తయి 21.

యేసు ఒకనాడు అసలైన యెరూషలేములో ప్రవేశించి, దాని వీధులలో గాడిదపిల్లనెక్కి తిరిగినాడు. మీకా 4:8లోని యెరూషలేము కుమార్తె మరియు జెకర్యా 9:9లోని యెరూషలేము కుమార్తె యిపుడు ఒకటిగానే కనుపించును. ఈ సమయములో యేసు యెరూషలేము ఏల ప్రవేశించెనో, ఆయన యెరూషలేమునకు ఏల సమీపముగానున్నాడో శిష్యులకు వివరించి, శిష్యులకు మరియొక ఉపమానముచెప్పి, దేవుని రాజ్యము తక్షణమె కనుపించునది కాదని వివరించినాడు. అయితే దేవుని రాజ్యము తక్షణమే కనుపించునని శిష్యులు భావించినారు.

## దీని ఫలితముగా శిష్యులు ఎదురు చూచుట

**Consequent anticipations of the disciples**

పరిశుద్ధ భూమియగు యెరూషలేములో యేసు ఇశ్రాయేలీయుల రాజ్యమును మరల స్థాపించునని శిష్యులు భావించుట సరియైనదేనని అందరూ తలంచారు, గాని శిష్యులు దేవుని రాజ్యమునుగూర్చి వేరుగా అర్థముచేసికొన్నారు, యేసు మరణ, పునరుత్థానములు వారి నిరీక్షణలను తారుమారుగావించి క్రీస్తు రాజ్యము పరలోకమునకు సంబంధంచినదేనని వారికి చూపించినవి. శిష్యులు క్రీస్తు ఆజ్ఞకు విధేయులై, లోకమందంతట దేవుని రాజ్య సువార్తను ప్రకటించిరి గనుక యిపుడు వారు భావించినట్టుగా దేవుని రాజ్యము ఈ లోకసంబంధమైనదికాక పరలోక సంబంధమైనది గనుక యిపుడు శిష్యులు దీనిని విశ్వసించుట యంత అసాధ్యము! క్షణకాలము వరకు యిది అసాధ్యముగానే కనుపించవచ్చు. దేవుని రాజ్యమునుగూర్చి వారు పొరపాటుగా భావించలేదుగాని అది సంభవించు సమయమునుగూర్చి వారు పొరబడిరి. దేవుని రాజ్యము వారి కాలములోనే సంభవించునని వారు తలంచిరి. చివరిసారిగా వారు యెరూషలేము ప్రవేశిస్తున్నారు, యిక దేవుని రాజ్యము స్థాపించబడునని భావించారు. యేసు పునరుత్థానమైన తరువాత ఎమ్మాయికి పోవుచున్న యిద్దరు శిష్యులు మాట్లాడుచుండగా వారు "ఇశ్రాయేలును విమోచింపబోవువాడు ఈయనే అని మేము నిరీక్షించియుంటిమి" లూకా 24:21 లూకా 19వ అధ్యాయములో యేసు యెరూషలేమునకు ఏల సమీపముగానున్నాడో యిపుడు తెలుస్తుంది. ఆయన సమీపముగా నుండుటకిదేకారణము. దేవుని రాజ్యమువచ్చు సమయమింకను రాలేదని వారికి వివరించవలసిన అవసరమున్నది. ఈ ఉపమానము సరియైనదేనని యిపుడు నీకు అర్థమగును. దేవుని రాజ్యము లేదనికాదు, గాని అది సంభవించుకాలము సమీపించలేదని వారికి బోధించవలసియున్నది. శిష్యుల నిరీక్షణను యిది రూఢిపరచుచున్నది, యేసు ఇశ్రాయేలు రాజ్యమునేలునని ఆ సమయమింకనూ రాలేదని, శిష్యులు యోచిస్తుండగా, సదరు విషయమును అనగా శిష్యుల నిరీక్షణను రూఢిపరచుచున్నవి.

## రాజకుమారుని గూర్చిన ఉపమానము

**The Parable of the Nobleman**

"రాజకుమారుడొక రాజ్యము సంపాదించుకొని మరల రావలెనని దూరదేశమునకు ప్రయాణమై తన దాసులను పదిమందిని పిలిచి వారికి పది మీనాలనిచ్చి నేను వచ్చు వరకు వ్యాపారము చేయుడని వారితో చెప్పెను. అయితే అతని పట్టణస్థులతనిద్వేషించి, యితడు మమ్మునేలుట మాకు ఇష్టము లేదని అతని వెనుకరాయభారము పంపిరి. అతడా రాజ్యము సంపాదించుకొని తిరిగివచ్చినపుడు ప్రతివాడును వ్యాపారమువలన ఏమేమి సంపాదించెనో తెలిసికొనుటకై తాను సొమ్మిచ్చిన దాసులను తనయొద్దకు పిలువుమని ఆజ్ఞాపించెను" లూకా 19:12-15.

యేసు ఆయన రాజ్యముతో తిరిగి వచ్చినపుడు మృతులకును, సజీవులకును తీర్పుతీర్చునని పౌలు చెప్పినదానికి, యేసు స్వయముగా చెప్పిన ఈ ఉపమానము సరిపడుటలేదా? అప్పటి పరిస్థితులు, ఈ ఉపమానము వెనుకటి చరిత్రను గమనించినట్లయితే మనకు బాగుగా అర్థమవుతుంది. రోమా సామ్రాజ్యము యొక్క పరగణాలకు క్రొత్తగా ఎవరైన రాజ ప్రతినిధివంటివారు. యితను జనుల యిష్టప్రకారము ఎన్నుకొనబడియుండవచ్చును. అయినను అతడు రోమా దేశముపోయి అచటి రాజుచేత అధికారిక అనుమతి పొందవలసియున్నది.

## "రాజప్రతినిధి" వంటి క్రీస్తు

**Christ The "Nobleman"**

యేసు క్రీస్తు ఏదేని ఒక సత్యమును మనకు వివరించవలసి వచ్చినపుడు దానిని ఒక ఉపమాననరూపములో తనకు సంబంధిమచిన ఒక కథ రూపములో వివరించెడివాడు. యిట్టి మర్మమును మనము ఆయనలో వెదకి గ్రహించాలి. యిట్టి మర్మములనుగూర్చి అంతగా వెదకనవుసరములేదు. ఇశ్రాయేలు రాజ్యములో భౌతిక సంబంధముగా యేసు మనకు వ్యక్తిగతముగా కనుపిస్తున్నాడు.

యూదుల దేశములో యేసు భౌతికముగా నుండుటకు తోడుగా యూదుల రాజుగా అభిషేకించబడి, దావీదు సింహాసనమునకు వారసుడుగానున్నాడు. ఇందుకు తగిన సాక్ష్యము మత్తయి 2:1లో వ్రాయబడింది.

"రాజైన హేరోదు దినములయందు యూదులదేశపు బెత్లెహేములో యేసు పుట్టినపిమ్మట ఇదిగో తూర్పుదేశపు జ్ఞానులు యెరూషలేమునకు వచ్చియూదులకు రాజుగా పుట్టినవాడెక్కడనున్నాడు? తూర్పుదిక్కునమేము ఆయన నక్షత్రమును చూచి, ఆయనను పూజించవచ్చితిమని చెప్పిరి. హేరోదు రాజు ఈ సంగతి వినినప్పుడు అతడును అతనితో కూడ యెరూషలెమువారును కలవరపడిరి, కాబట్టి రాజు ప్రధాన యాజకులను ప్రజలలోనుండు శాస్త్రులను అందరిని సమకూర్చి క్రీస్తు ఎక్కడపుట్టునని వారినడిగెను. అందుకు వారు యూదయ బెత్లెహేములోనే, ఏలయనగా - యూదయ దేశపు బెత్లెహేమా, నీవు యూదా ప్రధానులలో ఎంతమాత్రమును అల్పమైనదానవుకావు, ఇశ్రాయేలను నా ప్రజలను పరిపాలించు అధిపతి నీలోనుండి వచ్చును అని ప్రవక్తద్వారా వ్రాయబడియున్నదనిరి" మత్తయి2:1-5.

ఈ ప్రవచనమును ప్రజలు విశ్వసించాలి. ఏలయనగా యేసు యూదా దేశపు బెత్లెహేములో జన్మించినాడు, యిచట ప్రవచనము సంపూర్ణముగా నెరవేరినది. బెత్లెహేము నుండి ఇశ్రాయేలును యేలువాడు జన్మించినాడు. ప్రకటింపబడిన ప్రవచనము నెరవేరలేదని ఏ సిద్ధాంతమును బట్టి అన్యులు అబద్ధమాడెదరు? ఇదే విషయమును ప్రవక్తలందరు ప్రవచించిరి. మరియు క్రొత్త నిబంధనలో యేసు జననమును ప్రకటించుటకు కన్యమరియ వద్దకు వచ్చిన దూత వచనములను చూచెదము.

"ఇదిగో నీవు గర్భముధరించి కుమారునికని ఆయనకు యేసు అను పేరుపెట్టుదువు. ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును. ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయనకిచ్చును. ఆయన యాకోబు వంశస్థులగు యుగయుగములు ఏలును, ఆయన రాజ్యము అంతములేనిదైయుండునని ఆమెతో చెప్పెను" లూకా 1:31-33.

## కైసరుకు విరోధముగా యేసు

**Jesus as against Caesar**

దీని భావమేమి? యూదులకు రాజనియు, సిలువపై "యూదులకు రాజా నజరేయుడగు యేసు" అని వ్రాయబడిన పై విలాసమునకు యిది వేరు అర్థమునిచ్చునా? యోహాను 19:19, యిదే అంశము నాధారముచేసికొని ప్రధానయాజకులు, శాస్త్రులు, యేసును చంపించుటలో కృతకృత్యులయ్యారు. పిలాతు యేసును విడుదలచేయుటకు ప్రయత్నించినాడు. అయితే రాజకీయ ఒత్తిడికి లొంగి అతను యేసును శిక్షించుటకు ప్రజాకోర్టునకు అప్పగించినాడు. అపుడు యూదులు - "నీవు యితని విడుదల చేసితివా కైసరునకు స్నేహితుడవుకావు, తాను రాజునని చెప్పుకొనను ప్రతివాడును కైసరునకు విరోధముగా మాటలాడుచున్నావాడే అని కేకలు వేసిరి" యోహాను 19:12. ఈ ఒత్తిడికి పిలాతు నిలువలేకపోయినాడు. నిందుతుడని భావించబడిన యేసును సిలువ శిక్షకు అప్పగించి ఆ సిలువపై "యితడు యూదులకు రాజైన, నజరేయుడగు యేసు" అని పై విలాసమునుకూడా వ్రాయించినాడు. ఆ వెనువెంటజరిగిన సంఘటనను పరిశీలింతము. "యేసు సిలువవేయబడిన స్థలము పట్టణమునకు సమీపమై యుండెను. అదిహెబ్రీ, గ్రీకు, రోమా భాషలలో వ్రాయబడెను గనుక యూదులలో అనేకులు దానిని చదివిరి. నేను యూదుల రాజునని వాడు చెప్పినట్టు వ్రాయుము గాని యూదుల రాజు - అని వ్రాయవద్దని యూదుల ప్రధానయాజకులు పిలాతుతో చెప్పగా పిలాతు నేను వ్రాసినదేమో వ్రాసితినననెను" యోహాను 19:20,21.

## "యేసు అను వేరొక రాజును" గూర్చి అపొస్తలులు బోధించుట

**Apostles Preach "Another king, One Jesus"**

క్రీస్తు యొక్క రాచరికము తననుగూర్చిన సాక్ష్యములోనే భాగమైయున్నది. ఆ తరువాత ఆయన శిష్యుల సాక్ష్యములోకూడా యేసు రాచరికము ప్రముఖ స్థానము వహించినది. వారికి విరోధముగా థెస్సలొనికయలో చేయబడిన

నేరస్థాపనను గమనించుము.

"..... భూలోకమును తలక్రిందుచేసిన వీరు ఇక్కడికి కూడ వచ్చియున్నారు. యాసోను వీరిని చేర్చుకొనియున్నాడు. వీరందరు యేసు అను వేరొకరాజున్నాడని చెప్పి కైసరు చట్టములకు విరోధముగా నడచుకొనువారు అని కేకలువేసిరి" అపో.కా 17:6,7.

పెంతెకొస్తు దినమునాటి పేతురు సాక్ష్యమునుకూడా చూడుము, "అతడు (దావీదు) ప్రవక్తయై యుండెనుగనుక అతని గర్భఫలములో నుండి అతని సింహాసనము మీద ఒకని కూర్చుండబెట్టుదును అని దేవుడు తనతో ప్రమాణపూర్వకముగా ఒట్టుపెట్టుకొనిన సంగతి అతడెరిగి...." అపో.కా 2:30 దావీదు సింహాసనము మీద కూర్చొనుటయనగా యూదులకు రాజగుటయే. అచ్చటచ్చట విడివిడిగా వ్రాయబడిన వచనములన్నిటిని బట్టి యేసు ఈ లోక సంబంధముగా యూదులకు రాజు అని, దావీదు సింహాసనమధిష్టించినాడని మనము గ్రహించగలుగుచున్నాము.

## మొదట సిలువ, ఆ తరువాత కిరీటము

**First the cross, then the crown**

అప్పటికి అన్ని విషయములు సిద్ధపరచబడలేదు. పాపరహితము నిత్యత్వమనునది దావీదు రాజ్యము యొక్క నైజములు, యివి దేవునిచేత నిర్ధారింపబడినవి. యిట్టి దావీదు రాజ్యము స్థాపించబడకమునుపు జరుగవలసిన ముఖ్యకార్యమొకటున్నది. ఈ లోకము యొక్క పాపము తీసివేయబడవలసియున్నది, మరియు ఈ భూలోకమంతటికి శిరస్సుగా నుండబోవు దావీదు రాజ్యము స్థాపించు సమయమాసన్నమగుసరికి ఈ లోక పరిపాలన కార్యములో క్రీస్తుకు సహచరులును, సహాయకులుగా నుండు జనులు ఈ లోకవాసులలోనుండి వృద్ధిపొందవలసియున్నది. ఇట్టిపని సంపూర్ణమగుటకు కొంతసమయము అవసరము, అందుచేతనే యేసు కాలమున దేవుని రాజ్యస్థాపన సాధ్యపడలేదు. దేవుని రాజ్యము కంటికి కనబడుసమయము ఇంకనూ

సంభవించలేదని, యేసు యెరుగును, గాని ఆ రాజ్యము తక్షణమే వచ్చునని శిష్యులు తలంచిరి రాజకుమారుడొక రాజ్యము సంపాదించుకొని మరల రావలెనని దూరదేశమునకు ప్రయాణమైపోయిన ఉపమానమును యేసు వారికి ఈ కారణము చేతనే చెప్పినాడు.

## రాజకుమారుడు తిరిగి వచ్చుట

**The Nobleman's return**

యేసు ఆరోహణుడై వెళ్ళిపోయినాడు గనుక ఆయన విషయములో తిరిగి వచ్చుటయనునది సంశయాత్మకమైనది. మొదటవున్న చోటకేవెళ్ళినచోటికి తిరిగి రావలసియున్నది. యేసు ఏరీతిగా వెళ్ళెనో, అదే రీతిగా తిరిగి వచ్చునని ఈ ఉపమానము బోధిస్తుంది. ఈ సందేశము ఆయన శిష్యులకు ఒక దూత ద్వారా ఎంత వివరముగా చెప్పబడినదో చూచెదము "....ఏ రీతిగా పరలోకమునకు వెళ్ళుట మీరు చూచితిరో ఆ రీతిగానే ఆయన తిరిగి వచ్చునని వారితో చెప్పిరి" అపొ.కా 1:11. యూదులకు పేతురు చెప్పిన విషయములను కూడా చూచెదము. "మీ కొరకు నియమించిన క్రీస్తు యేసును ఆయన పంపునట్లును మీ పాపములు తుడిచివేయబడు నిమిత్తమును మారుమనస్సునొంది తిరుగుడి, అన్నిటికి కుదురుబాటు కాలములు వచ్చునని దేవుడు ఆదినుండి తన పరిశుద్ధ ప్రవక్తలనోట పలికించెను. అంతవరకు యేసు పరలోకనివాసియై యుండుట అవశ్యకము" అపొ.కా 3:20,21.

శిష్యులు తలంచిన దేవుని రాజ్యము వారు తలంచినపుడుగాక యేసుక్రీస్తు ఈ లోకమునకు రెండవసారి వచ్చినపుడు స్థాపించబడునని క్రొత్త నిబంధన పాఠములద్వారా స్పష్టమగుచున్నది. యేసు చెప్పిన రాజకుమారుని ఉపదేశములోని ముఖ్యపాఠము, ఇదియే దేవుని రాజ్యము యొక్క ఆలోచనను పాడుచేయుటకు ఆయన ఈ ఉపమానమును చెప్పలేదుగాని దేవుని రాజ్యము ప్రత్యక్షపరచబడెను సరియైనసమయమును నిర్దేశించుటకే ఆయన ఈ ఉపమానమును బోధించినాడు. ఈ ఉపమానము యొక్క ప్రభావమును బట్టి జనులు దేవుని రాజ్యమనగా యేసుక్రీస్తు రాకడలో ఆయన ద్వారా స్థాపించబడు, పునర్నిర్మింపబడు దావీదు

రాజ్యమని నిర్ధారించబడుచున్నది.

## జరిగిన కాలములో దేవుని రాజ్యము

**The Kingdom of God in the past**

మనము తరువాత ఆలోచించవలసినది ఏమనగా - నేటి మానవ రాజకీయ విషయములతో దేవుని రాజ్యము ఎట్టి సంబంధముకలిగియుండునను విషయము.

గడిచిన కాలములో దేవుడు ఒక రాజ్యమును కలిగియున్నాడు. అందు రాజకీయ సంస్థయున్నది. మోషేను ఐగుప్తునకు పంపి, అబ్రాహాము సంతానమును ఐగుప్తీయుల బానిసత్వము నుండి విడుదల చేయించి, కఠిన హృదయులైన కనానీయులను నాశనము చేయుటకై ఈ అబ్రాహాము సంతానమును ఒక గొప్ప సైనిక బలముగా ఉపయోగించుట ద్వారా దేవుడు రాజకీయ సంస్థను స్థాపించినాడు. గనుక యూదుల జనాంగము సుమారు వేయి సంవత్సరముల కాలమువరకు గొప్ప రాజకీయ సంస్థగా కనుగొనబడి నిలచినది, మరియు ప్రవక్తల ద్వారా అంతరంగ దైవికశక్తితో ఆ సైన్యము క్రమబద్ధికరింపబడినది, గత కాలమునకు సంబంధించి మానవుల విషయములో దేవుడు ఎన్నడును ఏ పొరపాటునుచేయలేదు, మరియు ఇశ్రాయేలీయుల రాజ్యము తిరిగి స్థాపించబడి ప్రాచీన కాలపు దేవుని రాజ్యముగా ఎంచబడినట్టుకూడా స్పష్టమగుచున్నది.

మత్తయి 21:43లో యేసు పరిసయ్యులకు యీలాగు చెప్పుచున్నాడు. "కాబట్టి దేవుని రాజ్యము మీ యొద్దనుండి తొలగింపబడి దాని ఫలమిచ్చు జనులకియ్యబడునని మీతో చెప్పుచున్నాను". యిపుడు వారి మధ్యలో లేని దేవుని రాజ్యము వారిలోనుండి ఏ విధముగా తొలగింపబడును? దేవుని రాజ్యము వారి మధ్యనుండి తొలగింపబడవలయుననిన ఆ సమయములో ఆ రాజ్యము వారి మధ్యను ఉండవలసియున్నది. అయితే వారి మధ్యవున్నదేమి? ఏలా? ఇశ్రాయేలు రాజ్యమును యేసు దేవుని రాజ్యమని ఏలాపిలచుచున్నాడు? ఇతర లేఖనములన్నిటికి సంబంధించి ఈ విధముగా చెప్పబడినది. ప్రతి లేఖనమందును ఇశ్రాయేల్యు రాజ్యము దేవుని రాజ్యముగా చెప్పబడినది. ఈ సత్యమును గూర్చిన ఒకటి, రెండు

లేఖనములను చూచెదము. "ఇపుడు దావీదు సంతతి వారి వశముననున్న యెహోవా రాజ్యముతో మీరు యుద్ధముచేయ తెగించెదమని తలంచుచున్నారు....." 2దినవృ 13:8. సొలొమోను యిలాగు చెప్పుచున్నాడు "అప్పుడు సొలొమోను తన తండ్రియైన దావీదునకు మారుగా యెహోవా సింహాసనమందు రాజుగా కూర్చుండి వర్ధిల్లుచుండెను. ఇశ్రాయేలీయులందరును అతని యాజ్ఞకు బద్ధులైయుండిరి" 1దినవృ. 29:23. ఇపుడు మరియొక వచనమును చూచెదము. ఇశ్రాయేలీయులు ఐగుప్తునుండి బయటికి వచ్చినపుడు "అన్యభాషగల జనులలోనుండి యాకోబు బయలువెళ్ళినప్పుడు యూదా ఆయనకు పరిశుద్ధ స్థలమాయెను. ఇశ్రాయేలు ఆయునకు రాజ్యవహాయెను" కీర్తన 114:1,2. గనుక పాత నిబంధన లేఖనములననుసరించి యేసు ఇశ్రాయేలు రాజ్యమును దేవుని రాజ్యముగా చెప్పినాడు ఈ ఇదే రాజ్యము యేసు ద్వారా మరల స్థాపించబడవలసియున్నది. ఈ రాజ్యము యెరూషలేములో స్థాపించబడవలసియున్నది. మరియు ఈ రాజ్యమునకు ఈ లోక రాజ్యములన్నియు విధేయులై, ఈ లోకమంతయు ఒకే ప్రభుత్వము ఆధీనమునకు రావలసియున్నది. యేసును శిరస్సుగా గలిగిన ఈ వసుధైక రాజ్యము సువార్త బోధలవలన సిద్ధపరచబడుచున్న పరిశుద్ధులతో పరిపాలింపబడాలి. మరియు ఈ పరిశుద్ధజనాంగము యేసు రెండవ రాకడ ద్వారా నిత్యత్వము పొందెదరు, లేక ఆయనకు సహాయముచేయు అర్హతగలిగి లోక పాలనయను గొప్పకార్యములో యేసుకు సహకరించెదరు, మరియు ఈ లోకము విడుదలను కలిగియుండును.

## ప్రవక్తయైన దానియేలు
### The Prophet Daniel

"చదువువాడు గ్రహించుగాక" అని చెప్పుచున్న ఈ పాఠమును ప్రవక్తల వెలుగులో పరిశీలిద్దాము. దానియేలు గ్రంథమందు వ్రాయబడిన యీ మాటలు నేటికింకను నిలిచియున్నవి. వీటిని తప్పుడుగా అర్థముచేసికొనడానికి వీలులేదు.

దానియేలు రెండవ అధ్యాయములో ఒక దర్శనమునుగూర్చి చదివెదము. అది చారిత్రాత్మకముగా సత్యమైనట్టిది, అందరికి సులువుగా అర్థమగునట్టిది. ఈ

కాలమునందలి ప్రపంచమంతటికి నెబుకద్నెజరు రాజు. అతనికి ఒక కలవచ్చినది. ఆ కలలో అతడొక ప్రతిమను చూచినాడు. ఆ ప్రతిమ అనేక రకములైన లోహాలతో నిర్మించబడినది. ఆ ప్రతిమ శిరస్సు బంగారముతోను దాని రొమ్ము భుజములు వెండితోను, దాని ఉదరమును తొడలును ఇత్తడితోను, దాని మోకాళ్ళు యినుముతోను, దాని పాదములలో ఒకటి యినుముతోను, ఒకటి మట్టితోను నిర్మింపబడినది, అతడు చూచుచుండగా చేతి సహాయములేకుండ పర్వతమునుండి తీయబడిన యొకరాయి ఆ ప్రతిమ పాదముపై పడి దాని పాదములను తుత్తునియలుగా విరుగగొట్టినది. ఆ బూడిద గాలిలోనికి ఎగసినది. ప్రతిమను విరుగగొట్టిన ఆ రాయి సర్వభూతలమంత మహాపర్వతమాయెను.

ఈ కలకు భావమును దానియేలు ఈ విధంగా వివరించినాడు. "రాజా! తమరు రాజులకు రాజైయున్నారు. తామే ఆ బంగారపు శిరస్సు, తమరి తరవాత మరియొక రాజ్యము బయలుదేరును. ఈ రాజ్యముకూడా విస్తీర్ణముతోను, బలముతోను పెద్దదై బబులోను కన్న బలములో అన్ని రాజ్యములను మించినదగును. అట్టి తరువాత తమరికన్న బలహీనమైన రాజ్యమొకటిలేచును. అది వెండివంటిది. బంగారముకన్న విలువతక్కువది. అటుపిమ్మట యిత్తడి వంటి రాజ్యములేచును ఆ తరువాత యినుము వంటి బలమైన రాజ్యమువచ్చును. ఇతరులందరికన్న బలముగలది. అయితే అది మన్నుతో కలిసినందున, సమయము వచ్చినపుడు తుత్తునియలుగా చేయబడి, రాజ్యము నశించునని" వివరించినాడు

## పరలోక రాజ్యము మరియు రాయి

**The Kingdom of Heaven and the stone**

44వ వచనములో యిలాగు చెప్పుచున్నాడు. "ఆ రాజులకాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యమును స్థాపించును. దానికెన్నటికి నాశనముకలుగదు. ఆ రాజ్యముదాని పొందిన వారికి కాక మరెవరికిని చెందదు. అది ముందు చెప్పిన రాజ్యములన్నిటిని పగులగొట్టి నిర్మూలముచేయును. గాని అది యుగయుగముల వరకు నిలుచును. చేతి సహాయములేక పర్వతమునుండి

తీయబడిన ఆ రాయి యినుమును యిత్తడిని మట్టిని వెండిని బంగారమును పగులగొట్టగా తమరు చూచితిరే యిందువలన మహాదేవుడు ముందు జరుగబోవుసంగతి రాజునకు తెలియజేసియున్నాడు" అని వివరించినాడు. దేవుడు ఈ లోకరాజ్యములన్నిటిని నశింపజేసి తన రాజ్యమును స్థాపించునని వివరించినాడు.

ముందుగా చూపించబడిన దర్శనమును బట్టి యిపుడు జరుగుచున్న అభివృద్ధియేమి? యిప్పటి వరకు జరిగిన ప్రపంచ చరిత్రను నిశితముగా పరిశీలించు బబులోను రాజ్యము మాదీయులు, పారశీలకులచే జయించబడినది. మాదీయులు, పారశీకుల కొంతకాలానికి యిత్తడిని పోలిన గ్రీకుల చేతిలో ఓడిపోయినారు. ఈ గ్రీకులు కూడా అతిబలమైన యినుమునుపోలిన రోమీయుల చేతిలో ఓటమిచూచినారు. ఇంతబలమైన సామ్రాజ్యము కొంతకాలానికి చిత్తుగా నశించినది. అతని కల నిజమైనది. యినుము యితర భౌతిక పదార్థములతో కలియుకాలము వచ్చును. అప్పుడే అది తుత్తునియలుగా విరుగును. యిపుడు ఐరోపాలో సంభవించుచున్న వాటికిని మంచి ఉదాహరణ

ఏమి జరుగనున్నది? చిన్నరాయి రాను రాను పర్వతమైనది. దీని భావమేమి?

## ఈ లోకరాజ్యములన్ని క్రీస్తు రాజ్యమగుట

**The Kingdoms of the world become Christ's**

ఈపై ప్రశ్నకు ఒకే ఒక సమాధానము. దేవుడు తన రాజ్యమును స్థాపించును. దేవుడు తాను పంపిన రాజునకు గొప్ప బలమనుగ్రహించును. ఆయన ఏర్పరచుకొనిన జనాంగమునకు, తనకు సహకారులుగా నుండగోరువాకి బలమనుగ్రహించును. పరిశుద్ధులందరిలో సర్వోన్నతుడని ప్రకటనలో వ్రాయబడినట్లు ఈ జనాంగము ఆయనను స్తుతించెదరు. "ఈ లోక రాజ్యము మన ప్రభువు రాజ్యమును ఆయన క్రీస్తు రాజ్యమునాయెను" ప్రకటన 11:15.

అతడు క్రీస్తు రాజులకు రాజుగాను, ప్రభువులకు ప్రభువుగాను అగును. ఆయన ప్రధాన యాజకుడగును. ఈ భూమియందంతట ఆయన దేవునికి ప్రతినిధిగా ఉండును, నిష్కల్మషమైన అధికారముతో మహిమాన్వితముగా ఈ

లోకవమును రాజరికపు యాజకత్వముతో ఈ లోకవుంతటిని ఆయునే పరిపాలించును. ప్రతి మోకాలు ఆయన తట్టు వంగి, ప్రతినాలుక ఆయనను స్తుతించు విధముగా ఈ లోకమంతటికిని క్రీస్తు నిష్కళంకమైన శిరస్సుగా ఉండును.

## యెరూషలేము నిజమైన నిత్యపట్టణము

**Jerusalem the True Eternal City**

ఈ ప్రత్యక్షత యొక్క కేంద్రస్థానమునుగూర్చి మనము ఎచట గమనించాలి? నిత్యరాజ్యము, నిత్య పట్టణముకొరకు మనము రోమీయుల పట్టణమును ఎంచుకొననవసరములేదు. పూర్వకాలములో దేవుడు తన నామమువుంచుకొనిన ఆ పట్టణముకొరకు అనగా "అన్యజనుల కాలములు సంపూర్ణమగువరకు యెరూషలేము అన్యజనులచేత త్రొక్కబడును" లూకా 21:24 అని యేసు చెప్పిన ఆ పట్టణముకొరకు నిరీక్షించెదము. ఈ అన్యజనుల కాలములు యించుమించు సంపూర్ణముకావచ్చినవి. సంపూర్ణమగు వరకు అనగానేమి? కాలములు పూర్తియగువరకు అనగా యెరూషలేము సర్వనాశనమగు సమయము వరకు అని అర్థము. ఆ కాలమున "యెహోవా యొక్క సింహాసనమని యెరూషలేమునకు పేరు పెట్టబడును" యిర్మీయా 3;17. ఆ పట్టణము మహిమగల రాజునకు నివాసస్థానమగును. "మరియు తనకు స్వాస్థ్యమని యెహోవా ప్రతిష్ఠితమైన దేశములో యూదాను స్వతంత్రించుకొనును, యెరూషలేమును ఆయన యికను కోరుకొనును" జెకర్యా 2:12. "ఆ కాలమున యెహోవా యొక్క సింహాసనమని యెరూషలేమునకు పేరుపట్టెదరు. జనములన్నియు తమ దుష్టమనస్సులో పుట్టు మూర్ఖత్వముచొప్పున నడుచుకొనక యెహోవా నామమునుబట్టి యెరూషలేమునకు గుంపులుగా కూడి వచ్చెదరు" యిర్మీయా 3:17. "చంద్రుడు వెలవెలబోవును. సూర్యుని ముఖము మారును. సైన్యములకధిపతియగు యెహోవా సీయోను కొండమీదను యెరూషలేములోను రాజగును. పెద్దలయెదుట ఆయన ప్రభావము కనబడును" యెషయా 24:23. "కాబట్టి ఆ కాలమున అన్యజనులనేకులు వచ్చి సీయోనులోనుండి ధర్మశాస్త్రమును యెరూషలేములోనుండి యెహోవావాక్కును

బయలువెళ్ళును. యాకోబు దేవుని మందిరమునకు యెహోవా పర్వతమునకు మనము వెళ్ళుదము రండి, ఆయన తన మార్గముల విషయమై మనకు బోధించును, మనము ఆయన త్రోవలలో నడచుకొందము అని చెప్పుకొందురు. ఆయన మధ్యవర్తియై అనేక జనములకు న్యాయముతీర్చును దూరమున నివసించు బలముగల అన్యజనులకు తీర్పుతీర్చును. వారు తమ ఖడ్గములను నాగటినక్కులుగాను, తమ ఈటెలను మచ్చుకత్తులుగాను సాగకొట్టుదురు, జనము మీదికి జనము ఖడ్గము ఎత్తకయుండును, యుద్ధముచేయనేర్చుకొనుట జనులు యిక మానివేతురు" మీకా 4:2,3 "ఏలయనగా సముద్రము జలములతో నిండియున్నట్లు భూమి యెహోవా మహాత్మ్యమునుగూర్చిన జ్ఞానముతో నిండియుండును" హబక్కూ 2:14.

## నిజమైన సంతోషవర్తమానము

**Real Glad Tidings**

దేవుని రాజ్యసువార్త సంబంధముగా నిజమైన సంతోష వర్తమానము ఇదే. ఇశ్రాయేలు ప్రవక్తలచేత ప్రకటించబడిన దేవుని రాజ్యము ఈ లోకపు చెడుగులన్నిటిని కుదర్చగల దివ్యౌషధము యిది. ఇదియే త్వరలో భూమిమీద స్థాపింపబోవు "దేవుని రాజ్యము".